తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## ఘనంగా గోదాదేవి కళ్యాణం

చిల్లకూరు, జనవరి 14, ప్రభాతవార్త:



మండలంలోని కల్వకొండ గ్రామంలో కొండపై వెలసి ఉన్న శ్రీ లక్ష్మి నరసింహా స్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాసం, భోగి పండుగ సందర్భంగా గోదాదేవి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పల్లకిలో ఉంచి పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ నలుమూల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా గూడూరుకు చెందిన మంజుశ్రీ వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను తాత శ్రీనివాస్ రావు కమిటీ సభ్యులు పర్యవేక్షణలో నిర్వహించారు.

## వేడుకగా గోదా కల్యాణం

తిరుమల, జనవరి 14ప్రభాతవార్తప్రతినిధి:



పవిత్రమైన ధనుర్మాసం చివరన ముగింపురోజు ఆదివారం సాయంత్రం గోదాదేవి కల్యాణం వేడుకగా నిర్వహించారు. తిరుపతిలోని అన్నమాచార్యకళామందిరంలో టిటిడి ఆధ్వర్యంలో గోదా కల్యాణం వైభవంగా జరిగింది. దేశవ్యాప్తంగా 216 కేంద్రాల్లో నెలరోజుల పాటు పండితులతో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు. ముందుగా గోదాదేవి రంగనాథస్వామి ఉత్సవర్లను వేదికపై కొలువుదీర్చారు ,అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణఘట్టం నిర్వహించారు.

## అందరి ఇళ్ళలో సుఖసంతోషాలు

### -జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



చిత్తూరు, నగరి, జనవరి 14 ప్రభాతవార్త:

సంక్రాంతి పండుగ అందరి ఇళ్ళలో సుఖసంతోషాలు తీసుకురావాలని రాష్ట్రభూగర్భ, గనులు, అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అకాక్షించారు. జిల్లా ప్రజానీకానికి సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మంత్రి పెద్దిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో సంక్రాంతి పండుగతో నూతన శోభను తెచ్చి పాడిపంటలు సంమృద్ధిగా వృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరులకుంటున్నట్లు తెలిపారు.

### అందరి ఇళ్ళలో కొత్తవెలుగులు: డిప్యూటీ సీఎం



సంక్రాంతి పండుగ అందరి ఇళ్ళలో కొత్తవెలుగులు నింపాలని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అకాక్షించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఆదివారం జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కర్షకులు, కార్మికులు, ఉద్యోగులు సంక్రాంతి పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకుని ఏడాది పొడవునా సంతోషంగా వుండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమఫలాలు అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుని ముందడుగు వేయాలన్నారు.

### ప్రతి ఇంట ఆనందాలు వెల్లివిరియాలి : మంత్రి రోజా



ప్రతి ఇంట ఆనందాలు వెల్లివిరియాలని మంత్రి రోజా అన్నారు. ఆదివారం నగరి పట్టణంలోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలసి ఆమె భోగి మంటలు వేసి భోగి పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న పాలనలో భోగి పండుగ పాత వస్తువులతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న కష్ట నష్టాలను కూడా కాల్చి వేసిందన్నారు. కార్యక్రమంలో ఆమె భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సెల్వమణి, కుమారుడు కృష్ణకౌశిక్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నారావారి ఇంట భోగి సంబరాలు

### ఉత్సాహంగా నారా నందమూరి కుటుంబాలు
### భోగి మంటల్లో ప్రజావ్యతిరేక ప్రభుత్వ జీఓలు





చంద్రగిరి, జనవరి 14 ప్రభాతవార్త:

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంట ఆదివారం బోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంబరాలకు నారా నందమూరి కుటుంబ సభ్యులు నారావారిపల్లికి చేరుకున్నారు. ఇందులో భాగంగా నారా లోకేష్, బ్రాహ్మిణీ దంపతుల కుమారుడు, నారా చంద్రబాబు నాయుడు, భువనేశ్వరీ, నందమూరి బాలకృష్ణ, వసుంధర దంపతుల మనవడు నారా దేవాన్ష్ ప్రధాన ఆకర్షణగా బోగి మంటలు వెలిగించారు. ఈ బోగి మంటల్లో ప్రజా వ్యతిరేక ప్రభుత్వ జీఓలను తగులబెట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ బోగి సంబరాలలో వేకువజామున నందమూరి రామకృష్ణ, కె. శ్రీనివాస్ బోగిమంటలు వేశారు. యావత్ తెలుగు ప్రజానీకం సుఖ సంతోషాల నడుమ సంక్రాంతి జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా గల తెలుగువారు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని బలంగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందమూరి వసుంధర, నందమూరి రామకృష్ణ, నారా ఇందిర, తేజశ్వనీ, లోకేశ్వరీ, శ్రీమాన్, కనుమూరి హైమావతి, సుచరిత, టిడిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి, టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్, తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా, ఉల్లాసంగా సంక్రాంతి సంబరాలు

నారావారిపల్లిలో సంక్రాంతి సంబరాలలో భాగంగా గ్రామంలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అదేవిధంగా కోలాటాలు, డిజె, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ సంక్రాంతి గొబ్బిళ్ళు తడుతూ తిరుగుతుండగా వీరితో కలసి నారా దేవాన్ష్, ఆర్యవీర్‌లు చేతులు తడుతూ అడుగులు కలిపారు. ముగ్గుల పోటీలలో రాణించిన మహిళలకు బహుమతులు అందజేసి అభినందించారు.

## సొంతూరుకు చంద్రబాబు, లోకేష్

### ఘన స్వాగతం పలికిన టిడిపి నాయకులు



చంద్రగిరి, జనవరి 14 ప్రభాతవార్త:

సొంతూరు నారావారిపల్లిలో సంక్రాంతి సంబరాలు జరుపుకునేందుకు టిడిపి అధినేత, మాజీ ముక్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు హెలికాప్టర్‌లో ఏ.రంగంపేటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు, మాజీ ఎంఎల్ ఎంఎల్‌ఏ సుగుణమ్మ, మాజీ ఎంఎల్‌సి దొరబాబు, నాయకులు కొల్లూరు ఇందు శేఖర్, భానుప్రకాష్, నరశింహా యాదవ్, పులివర్తి సుధారెడ్డి, పులివర్తి వినీల్, గురజాల జగన్మోహన్ నాయుడు, నెలవల సుబ్రమణ్యం, షాజహాన్, కోడూరు బాలసుబ్రమణ్యం, శివకోటిరెడ్డి, కుమార్‌రాజారెడ్డి, గిరిధర్ రెడ్డి, గౌష్‌భాషా, పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో దొంగ ఓట్లకు వ్యతిరేకంగా నారావారిపల్లిలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న కొమ్మినేని దామోదర్ నాయుడును పరామర్శించి, టిడిపి నాయకులను, కార్యకర్తలను పలకరిస్తూ ఇంట్లోనికి వెళ్ళారు. సాయంత్రం 4-6 గంటల వరకు ఇంటి ఆవరణలోని తన చాంబర్‌లో పార్టీ నాయకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

## కాణిపాకంలో ఘనంగా గోదాదేవి కళ్యాణం





వరదరాజ స్వామి ఆలయంలో జరిగిన గోదాదేవి కళ్యాణం, గోదాదేవికి జరిగిన గ్రామోత్సవం

కాణిపాకం, జనవరి 14 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి భూదేవి సయిత వరదరాజ స్వామి ఆలయంలో ఆదివారం వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీదేవి, శ్రీగోదాదేవి కళ్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో సంక్రాంతి సందర్భంగా భోగిపండుగ రోజున గోదాదేవి కళ్యాణం, గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈకార్యక్రమానికి కాణిపాకం చెందిన ధనంజయ యాదవ్ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయ ప్రధాన అర్చకులు పరవస్తు శ్రీనివాస భట్టాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సమూర్తులకు ఘనంగా అభిషేకించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అర్చకులు గోదాదేవి కళ్యాణంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. అలాగే ఆలయంలో గోదాదేవి కళ్యాణోత్సవం అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సమూర్తులకు మరోమారు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకపల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఉత్సవ ఉభయదారులు ధనంజయ యాదవ్ కుటుంబీకులు, ఆలయ అధికారులు, అర్చకులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

## రేపు కొండపై పార్వేట ఉత్సవం

### -ఆర్జితసేవలు రద్దు



తిరుమల, జనవరి 14ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాసం చివరన నేడు సంక్రాంతి పర్వదినం, రేపు కనుమపండుగరోజు పార్వేట ఉత్సవం జరుగుతుంది. మంగళవారం మధ్యాహ్నం ఉభయదేవేరులతో కలసి మలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామి ఆలయం నుండి మంగళవాయిద్యాలు, ఛత్రచామరల నడుమ పాపవినాశనం మార్గంలోని పార్వేటమండపం చేరుకుంటారు. అక్కడ ఆస్థానం, పార్వేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారు వేటాడిన రీతిలో బాణాలు విసిరి వన్యమృగాలను వేటాడుతారు. ఆలయంలో జరిగే అష్టదళపాదపద్మారాథన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది.

## వేడుకగా భోగి తేరు

తిరుపతి, జనవరి 14ప్రభాతవార్త:

ధనుర్మాసం చివరన భోగిపండుగ సందర్భంగా తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో స్వామివారి భోగితేరు ఆదివారం రాత్రి వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామిఅమ్మవార్లను భోగితేరుపై కొలువుదీర్చి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మాఢవీధుల్లో తేరును ఊరేగించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

### ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం
### ప్రమాదంలో ముగ్గురు స్నేహితులు మృతి





కన్నలి గౌతమ్, మునిరాజా( ఫైల్‌ఫోటోలు)

దొరవారిసత్రం, జనవరి 14 ప్రభాతవార్త

పండుగ వేళ సరదాగా ఆడుతూ పాడుతూ స్నేహితుడిని ఇంటి వద్ద దింపేందుకు బైక్‌పై తీసుకొస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ముగ్గురు మృత్యువాత పడ్డారు. దొరవారిసత్రం మండలం కలగుంట ఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు, నాయుడుపేట పట్టణానికి చెందిన మునిరాజా (29), కోగిలి రాంకి (24), దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామానికి చెందిన కన్నలి గౌతమ్ (23) అనే ముగ్గురు మోటార్‌బైక్‌పై వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మునిరాజా తీవ్రంగా గాయపడ్డాడు. ఇతన్ని నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాయుడుపేట పట్టణం నుంచి గౌతమ్ స్వగ్రామమైన దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామంలో విడిచిపెట్టడానికి మునిరాజా, కోగిలి రాంకి బైక్‌పై బయలుదేరారు. దొరవారిసత్రం వైపు వెళుతుండగా కలగుంట బ్రిడ్జి వద్ద అదే మార్గంలో వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి ఎస్ఐ జె.తిరుమలరావు, సిబ్బంది చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాలను పంచనామా నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రమాదాలకు నిలయంగా కలగుంట ఓవర్‌బ్రిడ్జి

దొరవారిసత్రం మండలం కలగుంట సమీపంలో ఉన్న ఓవర్‌బ్రిడ్జి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ బ్రిడ్జి వద్ద ఇప్పటికే ఎంతోమంది మోటార్‌బైక్‌ల ప్రమాదాలు జరిగి మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి.

## కన్నులపండువగా గౌరమ్మ గ్రామోత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం భోగిపండగ సందర్భంగా ఆలయంలోని కోట మండపం వద్ద భారీ ఎత్తున భోగి మండలు వేసారు. కాగా ఉదయం అలంకార మండపంలో గౌరమ్మను ముస్తాబు చేసి గ్రామోత్సవానికి తరలించారు. అమ్మవారిని అలంకరించి రాజగోపురం నుంచి వాహనాల మండపం వద్దకు తెచ్చి సప్పరంలో ప్రతిష్టించారు. గ్రామోత్సవాన్ని తేరువీధి నుంచి ప్రారంభించారు. నాలుగుమాడావీధుల్లో ఉత్సవం సాగింది. ఉత్సవంతో పాటు ఆలయ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు దఫేదార్ రాజా ఉన్నారు. ట్రాఫిక్‌ను రియాజ్‌బాషా వారి సిబ్బంది పర్యవేక్షించారు.

### నేడు సింహావాహనం:

శ్రీకాళహస్తిలో ధనుర్మాసం సందర్భంగా నెల రోజుల పాటు అమ్మవారిని గౌరమ్మగా గ్రామోత్సవం నిర్వహించటం ఆనవాయితి. మకర సంక్రాంతి సందర్భంగా అమ్మవారిని సింహావాహనంపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ మేరకు సోమవారం ఉత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు. అలాగే మంగళవారం జరిగే గిరిప్రదక్షిణ సందర్భంగా శూలం పల్లకి సోమవారం గిరి ప్రదక్షిణకు బయలుదేరుతుంది. ఈ మేరకు ఆలయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## కోటి సంతకాలు సేకరణ ఉద్యమం




గూడూరు, జనవరి 14, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని అంగన్‌వాడి కార్యకర్తలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 34 రోజులు చేరుకుంది. రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం నుండి జగనన్నకు చెబుదాం అని కోటి సంతకాల కార్యక్రమానికి గూడూరులో అంగన్‌వాడి కార్యకర్తలు శ్రీకారం చట్టడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంక్రాంతి పూట ప్రభుత్వం సమ్మెకు ముగింపు పలకాలన్నారు. అంగన్‌వాడీల జీతాలు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి అధ్యక్షురాలు ఏ. ఇంద్రావతి, కార్యదర్శి బిఎస్ ప్రభావతి, సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు పట్టణాధ్యక్షులు బివి రమణయ్య, కార్యదర్శి ఎస్. సురేష్, జి. మధు, ఏ. ప్రసాద్, బి. చంద్రయ్య, సుబ్బయ్య, సర్దార్ లీడర్లు పెంచలమ్మ, మునికుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కాపుమొండివెంగనపల్లెలో గిత్తల ఆట

### ఉరకలువేసిన ఉత్సహం -పోరును తిలకించడంకు మిద్దెలెక్కిన జనం

వెదురుకుప్పం, జనవరి 14 ప్రభాతవార్త :

మండలంలోని కాపుమొండివెంగనపల్లెలో సంక్రాంతి పండుగ పురష్కరించుకుని నిర్వహించే జల్లికట్టు పందెలను ఆదివారం భోగి పండుగ నాడే మొదలు పెట్టడంతో యువకులు రెట్టించిన ఉత్సహంతో గిత్తలతో పోటీకి దిగడంతో ఆట మొదలైయింది.... ఏటా జనవరి అంటే అందరికి సంక్రాంతి పెద్ద పండుగ గుర్తువస్తుంది. అలాగే ఆ పండుగ భాగంగా మూడవ రోజు పశువుల పండుగ గిత్తల పోటీలు నిర్వహించడం పరిపాటి... కాగా ఈ ఏడాది భోగి ముందుగా మండలంలోని కాపుమొండివెంగన పల్లెలో తొలి రోజు భోగి పండుగనాడు పశువుల పోటీలు నిర్వహించడంతో గ్రామంకు పెద్ద సంఖ్యలో జనం తరలిరావడంతో సంక్రాంతి శోభ సంతరించుకంది. గ్రామంలో యువకులు గ్రామంకు మాడితోరణాలు, రంగు కాగితాలు అంటించి పశువుల పోటీలకు గ్రామంకు అందంగా ముస్తాబు చేశారు. రైతులు తమ కోడిగిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి వివిధ అంకరణతో ముస్తాబు చేయడంతో పాటు కొమ్ములకు తమ ఇష్టామైన రాజకీయ నాయకులు, దేవుళ్ళ, సినిమా హిరోల చిత్రాలతో కూడిన చెక్కపట్టీలను కట్టించి అలంకరించారు. కొందరు రైతులు గిత్తలకు టవల్, నగదు బహుమతులు కట్టి పోటీకి దించారు. పోరుగు గ్రామాల నుంచి



పరుగులు తీస్తున్న గిత్త

గిత్తలను పందెలకు తీసుకురావడం జరిగింది. అల్లె కుస్తీకి సిద్ధమైన యువకులు ఉత్సహంతో ఊలలు, కేరింతలతో పౌరుషంతో పోటీలకు దిగడంతో గ్రామస్థులు గిత్తలను వదలి పెట్టారు. రెంటించిన పౌరుషంతో గిత్తలు జనంను చీల్చుకుంటు దప్పుల దరువులు మధ్య పరుగులు తీశాయి. యువకులు పట్టుజారకుండా గిత్తలను పట్టుకోవడంకు ప్రయత్నాలు చేశారు. కొన్ని గిత్తలు దొరకగా మరికొన్ని గిత్తలను జనం మధ్య పరుగులు తీశాయి. చెక్కపట్టీలు దక్కించుకున్న యువకులు కేరింతలు కొట్టి, విజయదరహాసంతో ఊగిపోయారు. పోటీలు ఆధ్యంతం



గిత్తలను నిలువరించే ప్రయత్నం చేస్తున్న యువకులు

రసవత్తంగా సాగాయి. చెరుదుమదురు సంఘటనలు మినహా పోటీలు ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగాయి. గిత్తలను నిలువరించే ప్రయత్నంలతో కొందరు యువకులు చిన్న చ్నిన్న గాయాలు పాలైవడం జరిగింది. చుట్టప్రక్కాల మండలాలు, తిరుపతి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పోటీలు తిలకించడంకు జనం రావడంతో పల్లెకు సంక్రాంతి శోభసంతరించుకుంది.

## లక్ష్మీపురంలో జగనన్నతో జనం..భరతన్నతో మనం కార్యక్రమం

కుప్పం,జనవరి 14 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి లక్ష్మీపురం వార్డు ప్రాంతాల్లో శనివారం ఎమ్మెల్సీ భరత్, ఆయన సతీమణి దుర్గ పద్మిని జగనన్నతో జనం, భరతన్నతో మనం కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ప్రజలు ఎమ్మెల్సీ దంపతులకు హారతులు పట్టి స్వాగతిం చారు. ఈసందర్భంగా వారు మహిళలకు పసుపు, కుంకుమ,చీరలుపంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ మాట్లాడతూ కుప్పం ఎమ్మెల్యేగా భరత్‌కు అవకాశం కల్పిస్తే అందుబా టులో ఉంటూప్రజాసేవచేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మణి, సోమశేఖర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలసిన కుప్పం తెలుగుతమ్ముళ్లు



కుప్పంరూరల్, జనవరి 14 ప్రభాతవార్త

సంక్రాంతి పండగ నిమిత్తం స్వగ్రామం నారావారిపల్లికి విచ్చేసిన తెదేపా అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడును ఆదివారం మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ అధ్వర్యంలో పలువురు తెదేపా యువనేతలు కలిశారు. ఈసందర్భంగా చంద్రబాబుకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ యూత్ అధ్యక్షుడు బాలు, కర్లగట్ట పంచాయతీ అధ్యక్షుడు గిరి, జిల్లా తెలుగుయువత కార్యదర్శి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశం కార్యకర్తల మృతికి ఆర్థికసాయం

రామకుప్పం, జనవరి 14 ప్రభాతవార్త

మండలంలోని బగళనత్తంకు చెందిన మునస్వామినాయుడు, కొటారిగడ్డకు చెందిన నారాయణ, బళ్లకు చెందిన శాంతమ్మ అనే తెదేపా కార్యకర్తలు అనారోగ్యంతో మృతి చెవదారు. దీంతో వారికి నివాళులు అర్పించిన దేశం నేతలు తలా పదివేల వంతున ఆయా కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు మునిరెడ్డి, శ్రీనాథరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మంజునాథ్, గోవిందప్ప, రాఘవేంద్రనాయుడు, సోమశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగరాజు నాయుడు, చంద్రప్పనాయుడు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర టువీలర్ దొంగలు అరెస్ట్ - డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

-ఇరవై లక్షల విలువచేసే వాహనాలు స్వాధీనం

వి.కోట, జూన్ 14 ప్రభాతవార్త



వివిధ రాష్ట్రాల్లో ద్విచక్రవాహనాలను చోరీ చేసే అంతరాష్ట్ర ముఠా దొంగలను అరెస్ట్‌చేసినట్లు పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ టువీలర్‌లో వచ్చిన ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కన్పించారన్నారు. వారిని విచారించగా టు వీలర్ల చోరీలు బయటపడ్డాయన్నారు. కర్ణాటక రాష్ట్రం కేసంబళ్ల సమీపంలోని కొత్తూరుకు చెందిన కుమార్, వి.కోట మండలం బంగ్లా ఊరుకు చెందిన పవన్‌లు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను చోరీ చేసేవారన్నారు. వీరికి వి.కోటకు చెందిన సలీం, సుబ్రమణ్యం అనేవారు సహకరించేవారన్నారు. వీరు చోరీ వాహనాలు విక్రయించేవారన్నారు. ఈనేపథ్యంలో నిందితులు కుమార్, పవన్‌లను అరెస్ట్ చేశామన్నారు. సలీ ం, సుబ్రమణ్యంలపై కేసు నమోదు చేశామన్నారు. వారినుంచి ఇరవై లక్షల విలువ చేసే ఇరవై రెండు టువీలర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐ లింగప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే దొరస్వామినాయుడు వర్ధంతి

- పేదలకు అన్నదానం.. ఉచితంగా దుప్పట్లు పంపిణీ !!

కుప్పం, జనవరి 14 ప్రభాతవార్త



కుప్పం మాజీ ఎమ్మెల్యే దివంగత బిఆర్ దొరస్వామి నాయుడు 24వ వర్ధంతిని ఆయన తనయుడు బిఆర్‌డి ఆస్పత్రి ఛైర్మన్, రాష్ట్ర తెదేపా కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు అధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర వ్వహించారు. స్థానిక బస్టాండు వద్ద ఆయన చిత్రపటం ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కుప్పం ప్రాంత అభివృద్ధికి ఆయన ఎమ్మెల్యేగా చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు. రైతులు, ప్రజల సౌకర్యార్థం కుప్పం రెస్కో స్థాపనకు చర్యలు చేపట్టి మారుమూల ప్రాంతాలకు విద్యుత్ వెలుగులు అందించడంతో పాటు పలువురికి ఉద్యోగావకాశాలు సైతం కల్పించారన్నారు. ఆయన బాటలోనే డా॥ సురేష్‌బాబు పయనిస్తూ ప్రజాసేవలో కొనసాగుతున్నారన్నారు. ఈసందర్భంగా అన్న క్యాంటీన్‌లో అన్నదానం చేశారు. పేదలకు డా॥ బిఆర్ సురేష్‌బాబు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత గోపీనాథ్‌తో పాటు వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కీడు తొలగాలి..ఎపి వెలగాలి..

- తెదేపా..జనసేన నేతలచే భోగిమంటలు



- సమస్యల ఫోటోలు.. పత్రాలు..ప్లకార్డులు కాల్చివేత

కుప్పం, జనవరి 14 ప్రభాతవార్త

రాష్ట్రానికి పట్టిన కీడు తొలగి వెలుగులు రావాలని కోరుతూ ఆదివారం స్థానిక బస్టాండు వద్ద తెదేపా,జనసేన నేతలు భోగిమంటలు వేశారు. రాష్ట్రంలో నెలకొన్న వివిధ సమస్యలు, ప్లకార్డులను భోగిమంటల్లో వేసి తగలబెట్టారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా అరాచక పాలన పోయి ప్రజలకు మేలు చేసే తెదేపా పాలన అధికారంలో రావాలని ఆకాక్షించారు. కొత్త ఏడాదిలో ప్రజలకు మంచి కలగాలని ప్రార్థించారు. మరలా చం ద్రబాబు నాయుడు సిఎం కావడం తథ్యమన్నారు. కార్యక్రమాల్లో నేతలు డా॥ వెంకటేష్, సతే ్యంద్రశేఖర్, కన్నన్, ఆర్‌ఆర్ రవి, నాను, మంజు, వేణు, నరేష్, పాండు, అప్పు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**కుప్పంరూరల్ :** మండలంలోని మల్లానూరులో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అధ్వర్యంలో రాష్ట్రానికి పట్టిన పీడ తొలగాలని కోరుతూ దేశం నేతలు భోగిమంటలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మరలా చంద్రబాబు సిఎం కావాలని రాష్ట్రం సుబిక్షంగా ఉండాలని ఉండాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సాంబశివం , నేతలు రమేష్, దామోదర్, అన్నాదొరై, రాజ్‌కుమార్, నాగార్జున, జయప్రకాష్, చిన్నదొరై, కృష్ణప్ప, సుభాష్, సుధాకర్, విభూషణ్, రాజ, గణేష్ పాల్గొన్నారు.

**శాంతిపురం :** మండల కేంద్రం శాంతిపురంలో ప్రజా వ్యతిరేక జిఒలను తెదేపా నేతలు భోగిమంటల్లో తగలబెట్టారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలన అనే కీడు తొలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, నాగభూషణరెడ్డి, ఎల్.జయరాంరెడ్డి, ఉదయ్‌కుమార్, ఉయ్యాల జయరాంరెడ్డి, మణి, నాగరాజు, రమేష్, రుద్రప్ప, సుగుణమ్మ, శంకర్ పాల్గొన్నారు.

**రామకుప్పం :** స్థానిక తెదేపా కార్యాలయం వద్ద వైకాపా ప్రభుత్వం తెచ్చిన జిఒలను దేశం నేతలు భోగిమంటల్లో వేసి కాల్చారు. మరలా తెదేపా అధికారంలో రావడం ఖాయమన్నారు. కుప్పంలో చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధనే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, సలాంసాబ్, టివి రవి, నందారెడ్డి, రామకృష్ణప్ప, జయశంకర్, విజయ్‌కుమార్‌రెడ్డి,విశ్వనాథ్,వెంకటాచలం, బాలరాజు, సుబ్రి, మంజునాథ్, ఆదిల్, సురేష్ పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ఐఆర్‌ఎం విద్యార్థుల ప్రతిభ

కుప్పం, జనవరి 14 ప్రభాతవార్త



తిరుపతి ఎస్వీయు విడుదల చేసిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ఐఆర్‌ఎం డిగ్రి కాలేజ్ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు సాధించినట్లు కాలేజ్ ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. బికాం (సిఎ)లో మనీషా 9.51/10శాతం పాయింట్లతో యూనివర్సిటీ ర్యాంకు సాధించిందన్నారు. బిఎస్సీ విభాగంలో త్రిష 9.09, బిబిఎలో హీసకౌసర్ 8.13పాయింట్లు సాధించారన్నారు. అలాగే అఫ్రీన్ అహ్మద్, త్రిలోకపావని, సూర్యకళ, పవిత్ర, శ్వేత, జీవిత, సుమయతబస్సు ంలు ఉత్తమ మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఛైర్మన్ బిఎం దయానిధి, అకడమిక్ డైరెక్టర్ డా॥ మధుసూధన్‌రెడ్డి అభినందించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాణిపాకంలో స్వచ్ఛతీర్థం ప్రారంభం

కాణిపాకం, జనవరి 14 ప్రబాతవార్త:



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలోఈనెల 14 నుండి 22 వరకు జరుగనున్న స్వచ్ఛతీర్థం ఆలయశుద్ధి సేవ కార్యక్రమ ఆదివారం లాంచనంగా ప్రారంభించారు. భారత ప్రధాని పిలుపుమేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈనెల 14 నుండి 22 వరకు దేవస్థానంలోని ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయాలు, నాలుగు మాడావీధులు, బస్టాండ్, లడ్డూపోటు, అన్నదాన వసతి గృహాలు, ఆలయ పరిసరాల్లో శుద్ధి,ఆలయ సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈకార్యక్రమంను ఆదివారం ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు స్థానిక ఆస్థాన మండపంలో లాంచనంగా ప్రారంభించారు. ఈమేరకు తొలిరోజు ఆలయ మాడావీధులు, అనుబంధ దేవాలయాలలో శుద్ధి కార్యక్రమంను నిర్వహించారు.ఆలయఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, రవీంద్ర బాబు, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి,దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కెపిఎల్ విజేతగా పిసిబి కుర్రాళ్ళు

-ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

రాజులూరు(చౌడేపల్లి), జనవరి 14 ప్రభాతవార్త



క్షత్రియ ప్రీమియర్ లీగ్(కెపిఎల్) విజేతగా మండలంలోని చుక్కావారిపల్లి, బాలసముద్రం, పందిళ్ళపల్లికి చెందిన పిసిబి కుర్రాళ్ళు విజేతలుగా నిలచారు. మండలంలోని రాజులూరు వద్ద నారాయణరాజు మెమోరియల్ మైదానంలో జరిగిన కెపిఎల్‌లో 11టీములు పాల్గొనగా 3రోజులపాటు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ అత్యంత ఉత్కంఠ భరితంగా సాగాయి. అదే విధంగా పాపిశెట్టిపల్లి పిఎస్‌పి హాక్స్ ద్వితీయ, కొత్తవీరపల్లి కెవిపి కింగ్స్ తృతీయ స్థానాలు కైవశం చేసుకొన్నాయి. మొదటి బహుమతి పిసిబి కుర్రాళ్ళు ట్రోపీతోపాటు రూ. లక్ష, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ. 75వేలు, రూ. 50వేలను అందుకొన్నారు. అంతే కాకుండా మ్యాన్‌ఆఫ్‌ది టోర్నమెంట్ నడింపల్లి పవన్‌రాజుకు(పిసిబికుర్రాళ్ళు) స్కూటర్‌ను, బ్యాటింగ్‌లో ప్రతిభ చూపిన పిఎస్‌పిహాక్స్ ఆటగాడు ప్రేమ్‌కుమార్‌రాజుకు ఎల్ఇడి టివీ, బౌలింగ్‌లో ప్రతిభ చాటిన పిసిబికుర్రాళ్ళ టీము అఖిల్‌రాజుకు ల్యాబ్‌ట్యాబ్‌లను ప్రోత్సాహకాలుగా అందించారు. అదే విధంగా బ్యాట్‌మెంటన్ పోటీల్లో 14టీములు తలబడగా బెంగళూరుకు చెందిన జీవన్‌రాజు, కిరణ్‌రాజులు మొదటిస్థానం రూ. 30వేలు ప్రోత్సాహకాన్నందుకోగా, పుంగనూరు టీము నారాయణరాజు, వంశీరాజులు ద్వితీయ స్థానం రూ. 20వేల నందుకొన్నారు. టోర్నమెంటులో అత్యంత ప్రతిభను కనబరచిన జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు తనయుడు నడింపల్లి పవన్‌రాజును అందరూ అభినందించారు. దివ్యశ్రీ అధినేత ఎన్.భాస్కర్‌రాజు, ఎన్.శ్రీనివాసరాజు, ఎస్.పురుషోత్తమరాజు, ఎన్.సుదర్శనరాజు, ఎన్.పురుషోత్తమ రాజు, సుబ్రమ ణ్యంరాజు, అనిల్‌కెశ్యామరాజు, శ్రీధర్‌రాజు, శంకరరాజు, క్షత్రియ ప్రముఖులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఆవు దూడ వితరణ

బోయకొండ(చౌడేపల్లి), జనవరి 14 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు ఆవు, దూడలను వితరణగా అందించారు. ఆదివారం కొండకింద గల గోశాలలో పెద్దవుప్పరపల్లికి చెందిన రేవంత్, ఝాన్సీ దంపతులు ఛేర్మన్ నాగరాజరెడ్డి సమక్షంలో అందించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు పవన్‌రాయల్, గాజుల మోహన్, గాజుల గణష్యామ్, హరీష్‌రాయల్, సాయిచరణ్, ఆలయ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

## రాగిమానుమిటలో వీధిలైట్ల ఏర్పాటు

**కుప్పంరూరల్, జనవరి 14 ప్రభాతవార్త** మండలంలోని వానగుట్టపల్లి పంచాయతీ రాగిమానుమిట్టలో గతకొంతకాలంగా వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో కో ఆప్షన్ సభ్యుడు అతహర్ స్పందించారు. గ్రామంలో తానే దగ్గరుండి స్వయంగా వీధి దీపాలను ఏర్పాటుచేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఆనందోత్సాహాలతో భోగి

సూళ్లూరుపేట, జనవరి 14 ప్రభాతవార్త

సంక్రాంతి సంబరాల్లో మొదటి పండుగ అయిన భోగి పండుగను ఆదివారం సూళ్లూరుపేట ప్రాంత ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. వేకువజామున తమ ముంగిళ్ల ముందు భోగి మంటలు వేసి సాంప్రదాయబద్ధంగా అనుసరించాల్సిన పద్ధతి ప్రకారం తల స్నానాలు చేసి కొత్త దుస్తులు ధరించారు. ఒకరికొకరు భోగి శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరాలు చేసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణంలోని చికెన్, మటన్ స్టాల్స్‌లో జనం బారులుతీరి పోటీలు పడి కొనుగోలు చేశారు.

## ఉరి వేసుకొని మహిళ మృతి

గూడూరు, జనవరి 14 ప్రభాతవార్త

గూడూరు రూరల్ మండల పరిధిలోని జాతీయ రహదారి వద్ద మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన సుధా సాహు, కమలేష్ సాహు దంపతులు జీవనం సాగిస్తున్నారు. వీరు గూడూరు హైవేపై గత మూడు నెలల నుంచి అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. శనివారం సాయంత్రం డ్యూటీ దిగి ఇంటికి వచ్చేసరికి భార్య ఉరి వేసుకొని మృతిచెందడం చూసి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి గూడూరు టౌ టౌన్ సీఐ వెంకటేశ్వరరావు, రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నార్త్‌వరత్తూరు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

చిట్టమూరు, జనవరి 14 ప్రభాతవార్త



దేశ ప్రధాని నరేంద్ర మోడీ పథకాల ప్రచారంలో భాగంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్ర మాన్ని ఆదివారం చిట్టమూరు మండలంలోని నార్త్‌వరత్తూరు గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన ఇఓపిఆర్‌డి మనోహర్ గౌడ్, మండల బిజెపిఅధ్యక్షుడుదువ్వూరుశరత్‌చం ద్రారెడ్డి పాల్గొని కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం లో అన్ని వర్గాల ప్రజలకు 17 రకాల పథకాలను అందజేస్తున్నారని, వీటన్నింటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## త్వరలోనే చంద్రబాబు పాలన వస్తుంది

- నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, జనవరి 14 ప్రభాతవార్త

రాష్ట్రంలో వైసీపీ నిరంకుశ పాలన నుంచి విముక్తి కలిగి త్వరలోనే నారా చంద్రబాబునాయుడి స్వర్ణయుగం పాలన వస్తుందని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పార్టీ పిలుపు మేరకు కీడుపోవాలి-మేలు జరగాలి కార్యక్రమంలో టిడిపి కారానయలయం వద్ద ప్రభుత్వ జీవోల కాపీలను తగులబెట్టారు. ఈ సందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు నేడు రాష్ట్రంలో భోగిమంటల్లో జనసేన, టిడిపి నాయకులు కలిసి అక్రమ జీవోలను తగులబెట్టామని తెలిపారు. ఆ భోగి మంటల సందర్భంగా రాష్ట్రానికి కీడు తొలగిపోయి రాష్ట్రానికి మేలు జరగాలన్న నినాదంతో పనిచేస్తున్నామని తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఓటర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో భీమవరం గ్రామ సర్పంచ్ అమృత సరళ, మండల టిడిపి అధ్యక్షుడు కామిరెడ్డి అశోక్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు అవధానం, సుధీర్, జిల్లా పార్టీ కారనయదర్శులు దార్ల రాజేంద్ర, మొండం బాబు, పార్టీ నాయకులు ముత్యాలయ్య, సుబ్బయ్య, వాకిరి వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తిన్నెలపూడిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కోట, జనవరి 14 ప్రభాతవార్త



కోట మండలం తిన్నెలపూడి గ్రామంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందించాలన్న ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు.మండల బిజెపి నాయకులు వాసు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## బీసీలంతా ఏకం కావాలి

రాష్ట్ర బిసి సెల్ సెక్రటిరి వల్లిపు మునిస్వామి

కోట,జనవరి 14 ప్రభాతవార్త

రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించేందు బీసీలంతా ఏకం కావాల్సిన అవసరముందని రాష్ట్ర తెదేపా బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటిరి వల్లిపు మునిస్వామి అన్నారు. ఆయన కోటలోఆదివారం విలేకర్లుతో మాట్లాడుతూ జగన్ పాలనలో బీసీలకు అన్ని రకాలుగా అన్యాయం జరిగిందని ఆరోపించారు.బీసీలతో పాటు దళితులు,మైనార్టీలపై వైకాపా నాయకులు వేధింపులకు గురయ్యారని ,వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని, పిలుపునిచ్చారు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చిరస్థాయిగా నిలిపోయే పనులు చేశారని అన్నారు. అందరూ బాగుపడాలంటే వచ్చే ఎన్నికల్లో తెదేపాను గెలిపించాలన్నారు. ఎన్నికల్లో బీసీలు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ప్రధాన రాజకీయ పార్టీలు వారికే అవకాశం కల్పించి టికెట్లును కేటాయించాలని ఆయన కోరారు. మరో 90 రోజుల్లో సీఎంగా చంద్రబాబే ప్రమాణిస్వీకారం చేస్తారని మునస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు జిల్లాలో వైకాపా ఖాళీ అవుతుందని పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆపార్టీని వీడి తెలుగుదేశంలో చేరేందుకు క్యూ కట్టుతున్నారని చెప్పారు.ఈ నెల 19న చంద్రబాబు నాయుడు వెంకటగిరికి వస్తున్నారని ఆకార్యక్రమంను ప్రజలు విజయవంతం చేయాలని మునిస్వామి పిలుపునిచ్చారు.

## సంక్రాతి కానుకలేవి జగనన్న !

కోట,జనవరి 14 ప్రభాతవార్త

ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాం.. గడప గడపకు నాణ్యమైన సరకులు అందిస్తాం.. ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీ ఇది. అధికారంలోకి వచ్చాక ఉన్న పథకాలు ఎత్తేశారు.మిగిలిన నెలల్లో ఎలా ఉన్నా.. పండగ సమయాల్లో పిండి వంటలు చేసుకునేందుకు సరకులు ఎంతగానో ఉపయోగపడతాయి. గత ప్రభుత్వం పండగలు వచ్చాయంటే పేదలకు ఆరు రకాల వస్తువులను ఒక కిట్‌గా అందించేదని ప్రజలు గుర్తుచేస్తున్నారు.రాయితీపై ఇచ్చి కంది పప్పు కూడా కొన్ని నెలలగా నిలిచిపోయింది. గత ప్రభుత్వ హాయాంలో గోధుమ పిండి, కందిపప్పు, శనపప్పు, బెల్లం, పామాయిల్, నెయ్యి, వంటి సరుకులు అందించేవారు. క్రిస్మస్,రంజాన్, తోఫా, ద్వారా ముస్లీం కుటుంబాలకు అందించే వారు .నేడు పండగకు ప్రభుత్వం కిట్‌లను ఇవ్వడం లేదని ఆయా వర్గాల ప్రజలు విమర్శిస్తున్నారు.

## వాడ వాడలా భోగి మంటలు

కోట,జనవరి 14 ప్రభాతవార్త

కోట మండలంలోని వాడ వాడలా ఆదివారం భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పల్లె ప్రజలు ఆనందోత్సావాతో జరుపుకొనే మూడు రోజుల ముచ్చటైన పండగ సంక్రాతి. భోగి ,సంక్రాతి, కనుమ వేడుకలు ప్రతి ఇంటి లోగిలిలో కొత్త శోభని నిపుంతాయి. పిండి వంటల ఘుమఘుమమలు మైమరిపిజేస్తున్నాయి.తొలి కోడి కూసే వేళకు ముందే చెందోడు, నెల్లూరుపల్లి కోత్తపాళెం,కోట, తిన్నెలపూడి, గూడలి, కర్లపూడి తదితర గ్రామాల్లో మందే భోగి మంటలు వేశారు.మకర రాశిలోకి సూర్యుడు ప్రవేశించి వేళ మది నిండుగా సంక్రాతి పండుగనే సంబురం మనందరిని చేరబోతోంది. వాడల్లో గంగిరెద్దుల ఆటలు.. ఇంటి ముంగిళ్లల్లో రంగవల్లికల సొబగులు, అందులో కొలువైన గొబ్బెమ్మలు నోములు, గోవులు, పశువుల అలంకరణలు పరవశం ,రైతుల దరహాసం వెరసి ఈ పండగ పల్లె జనుల గుండె వాకిళ్లలో కొత్త సంబురాన్ని మోసుకొస్తుంది. పండుగ ఉత్సాహం ఏడాదంతా ఉండాలి.. పల్లె వాసుల జీవితాల్లో వెలుగులు నిండాలి.గతం కంటే ఈసారి పల్లెల్లో పండగ వాతవరం బాగ కనబడుతోంది.

## ఘనంగా పద్మశాలి సంఘం డైరెక్టర్ ఎన్‌విఆర్ జన్మదిన వేడుకలు

వెంకటగిరి, జనవరి 14, ప్రభాతవార్త

పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, ఎన్వీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నక్క వెంకటేశ్వర రావు వైసిపి పార్టీ నాయకులు, అభిమానుల మధ్య ఆదివారం జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. పార్టీ నాయకులు, అభిమానులు స్నేహితులు మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ ఛైర్మన్ మల్లికార్జున్ రెడ్డి సీనియర్ న్యాయవాదులు లక్కమనేని కోటేశ్వర రావు, రాజేష్, వైసిపి నాయకులు రాజారెడ్డి, కౌన్సిలర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా భోగి పండుగ వేడుకలు

బాలాయపల్లి, జనవరి 14, ప్రభాతవార్త

మండలంలో ఆదివారం ఘనంగా భోగి పండుగ వేడుకలను ప్రజలు నిర్వహించుకునానరు. ఇంటి ముంగిట రంగుల ముగ్గులు వేసి భోగి మంటలు వేసి పండుగను నిర్వహించారు. చిన్నారులు కొత్త దుస్తులు ధరించి భోగి పండుగ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మండలంలో వైభవంగా భోగి పండుగ వేడుకలు జరిగాయి.

## వైభవంగా భోగి పండుగ వేడుకలు

వెంకటగిరి, జనవరి 14, ప్రభాతవార్త

పట్టణం గ్రామాల్లో వైభవంగా ఆదివారం భోగి పండుగ వేడుకలను ప్రజలు నిర్వహించారు. ఇళ్ళ ముగింట భోగి మంటలు వేసి పండుగను జరిపారు. తెల్లవారుజామునే అందరూ లేచి భోగి మంటలు వేశారు. చిన్న పెద్దలు వైభవంగా భోగి పండుగను నిర్వహించారు.

## కొండాగుంట గ్రామం నుండి భారీగా టిడిపిలో చేరికలు

గూడూరు, జనవరి 14, ప్రభాతవార్త



గూడూరు రూరల్ మండలంలోని కొండాగుంట గ్రామం నుండి 80 కుటుంబాల వైసిపి వారిని పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండగుంట గ్రామం నుండి మాజీ సర్పంచ్ బత్తల శ్రీనివాసులు రెడ్డి, మల్లారెడ్డి ఆధ్వర్యంలో కృష్ణా రెడ్డి, రమణయ్య, బాలయ్య, రాదయ్య, మనేయ్య, ఉప సర్పంచ్‌లు, ఎంపిటిసిలు వార్డు మెంబర్లు, యువత పార్టీలో చేరడం చాలా సంతోషకరమన్నారు. మీ చేరికతో కొండగుంట గ్రామం మొత్తం టిడిపికి సాలిడ్‌గా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, పట్టణ మండల పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, మాజీ కౌన్సిలర్ వాటంబేటి శివకుమార్, శంకర్ రెడ్డి, పెంచల్ రెడ్డి, ముమ్మడి అమరేంద్ర, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, జనవరి 14, ప్రభాతవార్త



గూడూరు ప్రభుత్వ హాస్పిటల్‌లోని ప్రసూతి కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ వైజేపీ ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారం బేబీ కిట్లను క్లబ్ సభ్యులు అందజేసారు. లైన్స్ క్లబ్ ఆఫ్ వైజేపీ ఆధ్వర్యంలో గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసూతి కేంద్రంలో ప్రసవం అయిన తల్లులకు పౌష్టికాహారం బేబీ కిట్లను క్లబ్ సభ్యులు అందజేసారు. ఈ కార్యక్రమానికి దాతగా మురళి నాయుడు వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎస్ఎల్ఎన్ స్వామి, ఆర్‌వి రావు, రవీందర్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

## పేదలకు దుస్తులు పంపిణీ

చిల్లకూరు, జనవరి 14, ప్రభాతవార్త



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రతి ఏడాది పేదలకు తమ వంతు చేయూత అందిస్తున్నామని రాజనేని రామానాయుడు చారిట బుల్ ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీనివాసులు నాయుడు, వారి సతీమణి శిరీష తెలిపారు. చిల్లకూరు మండలంలోని కడివేడు సమీపంలో ఉన్న సిరివనం గిరిజన కాలనీ, నక్కల వారి కండ్రిగ కాలనీలో పండుగ సందర్భంగా ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేసారు. ఈ సేవా కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు పిచ్చయ్య నాయుడు, ట్రస్టు ప్రతినిధులు రామయ్య నాయుడు, బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వానికి పతనం తప్పదు

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

**వెంకటగిరి, జనవరి 14, ప్రభాతవార్త** వైసిపి ప్రభుత్వానికి 87 రోజుల్లో పతనం తప్పదని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. సిఎం జగన్మోహన్ రెడ్డి జారీ చేసిన ప్రజా కంటక జీవో జీవో ప్రతులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే నివాసం వద్ద భోగిలో వేసి టిడిపి నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి పతనమయ్యే రోజులు దగ్గరపడ్డాయని తెలిపారు. ప్రజలను వైసిపి ప్రభుత్వ జీవోలు తీవ్రంగా ఇబ్బందులు పెట్టినట్లు చెప్పారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేవ్వరరావు పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు శ్రీనివాసులు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్ పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో సంక్రాంతి సంబరాలు-దుకాణాల్లో కిక్కిరిసిన జనం

శ్రీకాళహస్తి, జనవరి 14 ప్రభాతవార్త



ప్రతి ఏడాది మొదటగా వచ్చే పండుగల్లో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు ఎంతో ముఖ్య మైనవిగా చెప్పుకోవచ్చును. సంక్రాంతి సంబరాల్లో భాగంగా శ్రీకాళహస్తి పట్టణం లోని వీధుల్లో జనంతో నిండిపోయింది. పట్టణం లోని ప్రధానవీధు లయిన నెహ్రూవీధి, సినిమావీధి, బజారువీధి, నగరివీధులు జనంతో నిండిపోయాయి. ఈమార్గంలో ఉన్న బట్టల దుకాణాల్లో ఎటుచూసినా జనం పండగకు కొత్తబట్టలు కొనుగోలు చేస్తు కనిపించారు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఇక గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన జనంతో వీధులు నిండిపోయాయి. ఆర్‌టిసి బస్టాండువీధుల్లో కూడా జనం కిటకిటలాడారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఇళ్లకు కొత్తశోభను సంతరించుకుంటున్నాయి. గ్రామీణులు ఇంటికి కొత్తరంగులు వేయడానికి రంగులను తీసుకువెళ్తున్నారు. ఇక ఆర్టీసి బస్టాండు, బాబుఅగ్రహారం, కుమారస్వామి తిప్పవీధులు జనంతోనిండిపోయాయి. ఎక్కడ చూసినా ప్రజలు తమ చిన్నారులకు కొత్తబట్టలను కొనుగోలుచేసుకుని కావాల్సిన సామగ్రిని తీసుకుని వెళ్తున్నారు. ఇక మార్కెట్‌వీధిలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కూరగాయాల వ్యాపారస్తులుసైతం రోడ్లపైనే కూరగాయలను ఉంచి అమ్ముతున్నారు. ఇక బట్టల వ్యాపారస్తులు సైతం తమ రేట్లను తగ్గించలేదు. ఇక మహిళలు, యువతులు చీరల దుకాణాల్లో తమకు నచ్చిన వాటిని కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో దుకాణాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. పండగ అంటే కొత్త బట్టల కొనుగోలుకే ప్రాదాన్యత ఇస్తున్నారు. దాంతో వీధికి నాలుగైదు బట్టల దుకాణాలు వెలుస్తున్నాయి. ఎన్ని దుకాణాలు వెలసినా రద్దీ మాత్రం తగ్గటం లేదు. ఇక సంక్రాంతి సందర్భంగా చెరుకు గడలు సిద్ధమయ్యాయి. మహిళలు రంగవళ్లులకు రంగులు అద్దడం కోసం రంగులను కొనుగోలు చేయడం కనిపించింది. పెండ్లిమండపం వద్ద ట్రాఫిక్ ఎక్కువ కావడంతో పోలీసులు క్రమబద్ధీకరించారు. అయితే సాయంత్రం వర్షం పడడంతో వ్యాపారాలు దెబ్బతిన్నాయి.

## చిన్నారులకు భోగి పండ్లుతో ఆశీర్వాదాలు

శ్రీకాళహస్తి, జనవరి 14 ప్రభాతవార్త



తెలుగువారి తొలిపండుగ సంక్రాంతి. అది అందరికీ తెలిసిందే. అయితే ముందుగా భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు వస్తాయి. ఈనేపథ్యంలో భోగి పండుగ సందర్భంగా పట్టణంలోని కొత్తపేటలో నివాసం ఉంటున్న డాక్టర్ సతీష్, ఆశా దంపతులు వారి కుమార్తెకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. కన్నులపండువగా భోగి సంబరాలను నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ తెలుగువారి తొలిపండుగ భోగి, సంక్రాంతి, కనుమ అని పండుగలు తమ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుతెస్తాయన్నారు. నేటి కంప్యూటర్ ప్రపంచంలో ప్రతి ఒక్కరు పాశ్చాత్య సంస్కృతి, సంప్రదాయాలకు అలవాటు పడ్డారని అయితే మన తెలుగు సంప్రదాయాలను మరువరాదన్నారు. కార్యక్రమంలో గుణ, మురళీ, రాజా, లోకేష్, ప్రవీణ్, గుణశేఖర్, అభి తదితరులు పాల్గొన్నారు.

## భోగి మంటల్లో ప్రజా వ్యతిరేక జిఒలు

పుత్తూరు, జనవరి 14 ప్రభాతవార్త :

వైసిపి గత నాలుగున్నర ఏళ్లలో విడుదల చేసిన ప్రజా వ్యతిరేక జిఒలు విడుదల చేసిందని ఆరోపిస్తూ ఆదివారం మునిసిపాలిటీలోని ఒకటో వార్డు పరిధిలోని మిట్టపల్లూరులో టిడిపి చిత్తూరు జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి ఆధ్వర్యంలో జిఒ ప్రతులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి విడుదల చేసిన పలు జిఒలను హైకోర్టు కూడా కొట్టివేసిందని గుర్తు చేశారు. రాజ్యాంగానికి విరుద్ధంగా, తమ స్వప్రయోజనాలకు అనుగుణంగా జిఒలు ఇచ్చి ప్రజలను నానా ఇక్కట్ల పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి అర్జున్ రెడ్డి, నాయకులు ఆర్ముగరెడ్డి, ఏలుమలైరెడ్డి, నాగరాజు, మణి రెడ్డి, చిరంజీవి, నారాయణ, కుప్పారెడ్డి, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రైళ్ళలో విస్తృత తనిఖీలు



రేణిగుంట, జనవరి 14 ప్రభాతవార్త:

గుంతకల్ డివిజన్ జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు తిరుపతి రైల్వే డీఎస్పీ షాను సూచనలతో రేణిగుంట జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు రేణిగుంట రైల్వేస్టేషన్‌లో వివిధ రైళ్ళలో ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. అటు రైల్వేస్టేషన్లను, ఇటు ప్లాట్‌ఫాంపై వస్తున్న రైళ్ళలో అణువణువు పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు, సంక్రాంతిని పురస్కరించుకుని గంజాయి, మాధక ద్రవ్యాల రవాణా జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలను చేశారు. ప్రయాణికుల బ్యాగులను సైతం వదలకుండా చెక్ చేశారు. అనుమానితులను ప్రశ్నించారు. రైల్వేప్లాట్‌ఫాంపై తిరుగుతున్న వారిని టికెట్ లేకుండా ఉంటే బయటకు పంపించేశారు. తనిఖీల్లో జీఆర్పీ సీఐ దేవేంద్రకుమార్, ఎస్ఐ రవి, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ సందీప్, ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## దొంగ ఓటు ప్రజా స్వామ్యానికి చేటు



జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్

తిరుపతి టౌన్, జనవరి 14, ప్రభాతవార్త

దొంగ ఓట్లను తొలగించకపోతే ఆందోళనలు ఉదృతం చేస్తామని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డా. పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. చనిపోయిన వారి ఓట్లను కూడా తొలగించకపోవడం దారుణమన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేసారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం తిరుపతి జిల్లాలో 17,62,205 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అలాగే వివిధ ఫారాల కింద పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆ ముసాయిదా ప్రకారం బిఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహిస్తే అందులో 3.88 శాతం అంటే 63308 మంది ఆబ్సెంటీ (స్థానికంగా లేని) ఓటర్లు ఉన్నట్లు గుర్తించారన్నారు. వీరిలో ఒక్క తిరుపతి నియోజకవర్గంలో 38396 మంది ఉన్నారన్నారు. ఈ ఓట్లను వినియోగుంచుకుని అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుయుక్తులు పన్నుతోందన్నారు. వచ్చే ఓటర్ల జాబితాలో అనర్హులను తొలగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే అందోళనను ఉదృతం చేస్తామన్నారు.

## పెద్దన్న పాత్ర పోషించాల్సింది చంద్రబాబే..

రాష్ట్ర కాపు నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్



తిరుపతి టౌన్, జనవరి 14, ప్రభాతవార్త

పెద్దన్న పాత్ర పోషించాల్సింది చంద్రబాబే అని రాష్ట్ర కాపునాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి తిలక్ రోడ్డు నందు ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాపునాడు జాతీయ అధ్యక్షులు రమేష్ నాయుడు, కాపునాడు రాష్ట్ర కన్వీనర్ గిద్ద శ్రీనివాస్ నాయుడు విచ్చేసారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాపు నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచి ముఖ్యమంత్రి కావాలని కాపుల చిరకాల వాంఛ అని, రెండు సామాజికవర్గాలే రాష్ట్రాన్ని పాలిస్తూ వారి వారి సామాజికవర్గ ప్రయోజనాలే ముఖ్యంగా పనిచేసారు. ప్రతి ఎన్నికలలో కాపులను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప రాజకీయంగా తగిన ప్రాధాన్యతను ఇవ్వడంలేదని తెలిపారు. వైసిపి కాపులకు మొదటి నుండి తీరని అన్యాయం చేస్తున్నదని చెప్పారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ కాపు సంఘాలను ఉద్దేశించి కాపులు పెద్దన్న పాత్ర పోషించి ఐక్యంగా తనను గెలిపించాలని తెలిపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు రమేష్ నాయుడు ,గిద్ద శ్రీనివాస్ నాయుడు, బెల్లంకొండ సురేష్, రాజేంద్ర, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## స్వగ్రామంలో ఇంటింటికి బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో బొజ్జల సుధీర్‌రెడ్డి,ఆయన సొదరుడు రాము వారి కుటుంబానికి చెందిన యువకులు ఇంటింటికి వెళ్ళి ఆత్మీయ పలకరింపు నిర్వహించారు.సంక్రాంతి పండగ సందర్భంగా బొజ్జల కుటుంబం సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.ఏడాదిగా బొజ్జల కుటుంబంలో పలు విషాదకర సంఘటనలు చోటు చేసుకున్నాయి, ఇక ఇంటికి పెద్ద దిక్కులైన బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, బొజ్జల హరినాథ్‌రెడ్డిలు లేకపోవటంతో కుటుంబ బాధ్యతలు బొజ్జల సుధీర్‌రెడ్డిపై పడింది. అంతేకాక రాజకీయంగా ప్రత్యర్థి వర్గం సుధీర్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇక్కడ తిష్టవేసి తరువాత హైదరాబాదుకు ఊడాయిస్తున్నారనే విమర్శలను తిప్పి కొట్టడానికి ఆయన ఇక్కడే ప్రస్తుతం ఉన్న ఇంటి వెనుకే నేటి సాంకేతిక పరిజ్ఞానంతో నూతన గృహాన్ని నిర్మించుకుంటున్నారు. అంతేకాక స్వగ్రామంలో తమ కుటుంబస్థానాన్ని నిలబెట్టుకొనుటకు సుధీర్‌రెడ్డి సంక్రాంతి పండగ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి పలకరిస్తూ తన ఉనికిని చాటుకుంటున్నారు.ఇక ఇంటి వద్ద బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషితారెడ్డిలు వచ్చే అతిథులను పలకరిస్తూ భోగిపండగ సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు.

## మాజీ ముఖ్యమంత్రిని కలసి మాజీ ఎంఎల్ఏ

.శ్రీకాళహస్తి, జనవరి 14 ప్రభాతవార్త



సంక్రాంతి పండుగ సందర్భంగా నారావారి పల్లికి విచ్చేసిన తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడును శ్రీకాళ హస్తి మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు కలసి ఆయకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు నారాయణయాదవ్ పలువురు తెదేపా నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## 34వ రోజుకు చేరిన అంగన్‌వాడీ కార్యకర్తల రిలే నిరాహారదీక్షలు

నారాయణవనం, జనవరి 14 ప్రభాతవార్త :



అంగన్‌వాడీ కార్యకర్తలు గత 12వ తేది నుంచి స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట న్యాయమైన కోర్కెల సాధనం కోసం చేపడుతున్న రిలే నిరాహారదీక్ష ఆదివారం 34వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులకు సిపిఎం నేతలు అండగా నిలుస్తూ న్యాయమైన కోర్కెల కోసం అంగన్‌వాడీ సిబ్బంది చేపడుతున్న ఆందోళనకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. దీని వల్ల అంగన్‌వాడీ సిబ్బందితో పాటు గర్భవతులు, పిల్లలు నష్టపోతున్నట్టు గుర్తు చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు.

## వాడవాడల ఘనంగా భోగి పండుగ సంబరాలు

నారాయణవనం, జనవరి 14 ప్రభాతవార్త :





మండలంలోని అన్ని గ్రామాలలోను సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం భోగి పండుగను ప్రజలు వాడవాడల ఘనంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకే చాలామంది భోగిమంటలను ఇళ్లముందు వేశారు. శనివారం భోగి మంటలను వేసిన వారు స్నానం చేసిన తర్వాత కొత్తబట్టలను ధరించి ఒకరికొకరు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం నారాయణవనంలోని కల్యాణవేంకటేశ్వరున్ని ఆలయానికి వెళ్లి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. మహిళలు ఇళ్లముందు రంగులముగ్గను ఆకట్టుకొనే విధంగా వేశారు. అలాగే టిటిడి ఆలయం కల్యాణవేంకటేశ్వరుని ఆలయం ఎదుట భోగిమంటలను వేశారు. సాయంత్రం అమ్మవార్ల సమేతంగా కల్యాణవేంకటేశ్వరున్ని తిరుచ్చివాహనంపై అదిరోహించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ప్రధానఅర్చకులు శ్రీధర్‌భట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్యలు, శ్రీనివాస భట్టాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నేటి నుంచి సుప్రభాత సేవలు :**

నారాయణవనంలో ప్రసిద్ది చెందిన టిటిడి ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో ఆదివారం ఉదయం నుంచి సుప్రభాత సేవలతో స్వామి, అమ్మవార్లను మేల్కొల్పడం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. గత నెల 15వతేది ప్రారంభమైనా ధనుర్మాసపూజలు సమయంలో ప్రారంభమైన తిరుప్పావై ప్రవచనం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. నేడు సోమవారం ఉదయం 5గంటల నుంచి సుప్రభాతసేవతో స్వామి వారి మేల్కొలుపుతో ప్రారంభంకానుంది.

## కైలాసనాధకోనలో సంక్రాంతి పండుగ సందడే..సందడి..

నారాయణవనం, జనవరి 14 ప్రభాతవార్త :



నారాయణవనం మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయితీ పరిధిలోని కైలాసనాధకోనలో సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మొదటిరోజు భోగి పండుగ సందర్భంగా ఆదివారం వేలాదిమంది భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా కోనకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు రాష్ట్రం నుంచి వేలాదిగా భక్తులు, పర్యాటకులు తరలివచ్చారు. అనంతరం పవిత్రజలపాతంలో స్నానాన్ని ఆచరించిన తర్వాత స్వామి, అమ్మవారికి టెంకాయహారతులు సమర్పించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఛైర్మన్ ఇ సుబ్రమణ్యంయాదవ్, ఇఓ కృష్ణానాయక్, మాజీ ఛైర్మన్ బత్తల భాస్కర్‌బాబుయాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ గోదాదేవి శ్రీ రంగనాథుల కల్యాణ మహోత్సవం

పుత్తూరురూరల్, జనవరి 14 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవిసమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ గోదాదేవి శ్రీ రంగనాథుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాత పుత్తూరు పట్టణానికి చెందిన ముత్యాల హిమాచల బాబు, వనజ దంపతులు(శ్రీ సాయిరాం ట్రావెల్స్) వ్యవహరించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఉభయ దాతగా ఈశ్వరాపురంకు చెందిన సూరపురాజు, ప్రకాష్‌రాజు, రమణమ్మ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బాల ముత్తు, మోహన్, పాలక మండలి సభ్యులు ముకుంద, ప్రకాష్, సెల్వరాజ్‌పిళ్లై, పి.మునిరాజా, లక్ష్మి సుధ, వెంకటేశులు, నిర్మల, సురేష్, మహాదేవి, ఆలయ పూజారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పిడికిలి గంగమ్మకు వెండీ శూలాలు వితరణ

పుత్తూరురూరల్, జనవరి 14 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణం బజారువీధిలో వెలసిన శ్రీ పిడికిలి గంగమ్మకు పుత్తూరు పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాధి మాడా శ్రీనివాసులు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి రెండు వెండీ శూలాలు వితరణ అందించారు. ముందుగా పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయంలో విశేష పూజలు చేసి మంగళ వాయిద్యాల నడుమ బజారు వీధి, కాపు వీధుల్లో ఊరేగించి ఈ వెండీ శూలాలను పిడికిలి గంగమ్మ దేవాలయంలో విశేష అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం గంగజాతర కమిటీ సభ్యులకు ఈ వెండీ శూలాలు అందించారు. ఉభయ దాతకు గంగజాతర కమిటీ సభ్యులు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## పల్లెల్లో సంక్రాంతి సందడి

పుత్తూరురూరల్, జనవరి 14 ప్రభాతవార్త:



ప్రాచీన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ సంక్రాంతి పండుగ రానే వచ్చింది. ఉత్తరాయణ పర్వదినాల్లో సూర్యుడు మకర రాశిలోకి సంక్రమణం చేసే పర్వదినాన్ని మకర సంక్రాంతిగాను, దాని ముందు రోజు భోగి, కనుమ, ముక్కనుమగా జరుపుకుంటారు. ఈ నాలుగు రోజుల పవిత్ర దినాలుగా భావించి ప్రజలు ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ. సంక్రాంతి సందడితో గ్రామాల్లో ఎక్కడ చూసినా ఆహ్లాదకర వాతావరణమే దర్శనమిస్తుంది. పల్లెల్లోని మహిళలు గొబ్బెమ్మలు అలంకరించి ఇంటింటికి తిరుగుతూ సామూహికంగా పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. పండుగలో ప్రాధాన్యత సంతరించునే రంగుల ముగ్గు పిండి, మట్టికుండలు, చెరకు గెడలు, ఇతర అలంకరణ సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చే మహిళలతో ఫ్యాన్సీ దుకాణాలు రద్దీగా ఉన్నాయి. ప్రధాన కొనుగోలు దారులతో సందడిగా మారింది.

# పండుగలు మన తెలుగు సాంప్రదాయాలకు ప్రతీకలు

## -కర్నూలు జిల్లా కలెక్టర్ గుమ్మళ్ళ సృజన





తొట్టంబేడు, జనవరి 14 ప్రభాతవార్త

మన తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ళ.సృజన అన్నారు. టిటిడి జెఇఒగా తిరుమలలో సేవలందించి, అటు కర్నూలు జిల్లా కలెక్టర్‌గా, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శిగా, దేవాదాయశాఖ కమిషనర్‌గా సేవలందించి ప్రస్తుతం పదవీవిరమణ చేసిన జి.బలరామయ్య, తమ కుటుంబసభ్యులతో సంక్రాంతి పండుగరోజున ప్రతి ఏడాది క్రమం తప్పకుండా తమ స్వగ్రామమైన తొట్టంబేడు మండలంలోని పూడి గ్రామానికి వస్తారు. ఈసందర్భంగా ఆయన కుమార్తె తండ్రిబాటలో పయనించి ఆయన్ను ఆదర్శంగా తీసుకుని నేడు ఎపిఐఐసి వైస్ ఛైర్మన్ మరియు ఎండిగా పనిచేసి నేడు కర్నూలు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ గుమ్మళ్ళ.సృజన ఆధ్వర్యంలో ఆదివారం స్వగ్రామం పూడిలో సంక్రాంతి సంబరాలను అంగరంగవైభంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ మన సంస్కృతి, నాగరికతలకు అనుగుణంగా పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఇందులో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు ఎంతో ముఖ్యమైనవిగా అభిప్రాయపడ్డారు. నేడు యువత వారివారి ఉద్యోగరీత్యా, కుటుంబబాధ్యతలకు మాత్రమే పరిమితం అవుతున్నారని రాష్ట్రం గురించి కూడా పట్టించుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలోని 'స్పందన స్వచ్చంద సేవాసంస్థ', పూడియువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని యువకులకు,చిన్నారులకు, క్రీడాకారులకు బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, కోకో, చిన్నారులకు మ్యూజికల్‌ఛైర్స్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. పండుగ సమయాల్లో స్వగ్రామంలో అందరితో గడపడం తమకు ఎంతో ఆనందమని ఆమె వివరించారు.రానురాను పండుగ ప్రాభవం తగ్గిపోతోందని సినిమాలు, టివిల వలన యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడుతోందన్నారు. టివిలు, ఇంటర్‌నెట్‌లు వచ్చిన తర్వాత యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడుతున్నారని భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను అందించాలంటే వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిన్ననాటి గుర్తులు అందరికీ గుర్తుండాలంటే తాము పుట్టిన పల్లెసీమలను మరచిపోకూడదన్నారు. రానురాను పండుగలకు ప్రాముఖ్యత తగ్గిపోతోందని పండుగ ప్రాశస్త్యాలను తెలుసుకునేందుకు తమ వంతు ప్రయత్నాలుచేస్తున్నామన్నారు. గత పది సంవత్సరాలుపైగా తాము సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామన్నామని, గ్రామీణ క్రీడలైన గోళీలు, బొంగరాలు, చిల్లంకోడు, కబడ్డీలతో పాటు వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు, మహిళలకు రంగవళ్లులు పోటీలు నిర్వహించి నిర్వహించి చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపుతామన్నారు. కార్యక్రమాల్లో మాజీ దేవాదాయశాఖ కమిషనర్ గుమ్మళ్ళబలరామయ్య, న్యాయవాది పి.రవితేజ, స్పందన స్వచ్ఛందసేవాసంస్థ సభ్యులు జలకంబాలమురళీ, జలకం.శ్రీనివాసులు, మాధవయ్య, చక్రి,పలువురు సభ్యులు, గ్రామస్తులు చిన్నారులు పాల్గొన్నారు.

# కాణిపాకం ఆలయంలో ఘనంగా భోగి వేడుకలు




కాణిపాకం ఆలయం వద్ద వేసిన భోగి మంటలు, భోగి పండ్లులో చిన్నపిల్లలను ఆశీర్వదిస్తున్న ఆలయ ఛైర్మన్, ఈఓలు

కాణిపాకం, జనవరి 14 ప్రభాతవార్త: సంక్రాంతి పండుగ పర్వదిన సందర్భంగా శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో ఆదివారం బోగి రోజున మన సంస్కృతి-మన పండుగ కార్యక్రమంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. రాష్ట్రదేవాదాయ ధర్మాదాయ శాఖ, మరియు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఆదివారం బోగి వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా వరదరాజస్వామి ఆలయం ముందు వేకువజామున బోగి మంటలు వేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు రమేష్, గిరి,ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆస్థాన మండపంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా బోగి సందర ్భంగా చిన్నపిల్లలను బోగిపండ్లుతో ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి,ఈఓ వెంకటేశు, ఆలయ సూపరెడెంట్‌లు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## భక్తుల నుంచి పూజలందుకొన్న గంగమ్మ



బోయకొండ(చౌడేపల్లి), జనవరి 14 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొండదినం కావడంతో వేదపండితులు, అర్చకులచే ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఛేర్మన్ నాగరాజరెడ్డి పెద్దభోగం, తీర్థప్రసాదాలు, క్యూలైన్లలో పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కల్గించకుండా సులభ దర్శనం అయ్యేలా చర్యలు తీసుకొన్నారు. ధర్మకర్తల మండలి సభ్యుడు పవన్‌రాయల్, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.

## శ్రీసిటీ వెంచర్ పరిశ్రమ సిఈఓకు ఇంటర్నేషనల్ అచీవర్ అవార్డు

సత్యవేడు, జనవరి 14, ప్రభాతవార్త:

శ్రీసిటీలోని వెంచర్ ఆటోమోటివ్ కూలింగ్ ఇండియా ప్రైయివేట్ లిమిటెడ్ పరిశ్రమ సిఈఓ శరవణన్‌ను ప్రతిష్టాత్మక యురేషియన్ బిజినెస్ సమ్మిట్ ఇంటర్నేషనల్ అచీవర్ అవార్డు వరించింది. ఇటీవల లండన్‌లోని హౌస్ ఆఫ్ కామర్స్‌లో జరిగిన యురేషియన్ బిజినెస్ సమ్మిట్‌లో శరవణన్‌కు అవార్డు ప్రధానం చేశారు. ఉత్తమ ఇంజనీరింగ్, నూతన ఆవిష్కరణల ప్రతిభకు గుర్తింపుగా ఈఅవార్డు దక్కింది. అంతర్జాతీయ వాణిజ్యం సహకారాన్ని ప్రోత్సహించడానికి వివిధ దేశాలకు చెందిన 100మంది ప్రతినిధులను ఒకచోట చేర్చి చర్చించడమే యురేషియన్ బిజినెస్ సమ్మిట్ ముఖ్యఉద్దేశ్యం. ప్రస్తుత సమ్మిట్‌లో వ్యాపారం, విద్య, సాంస్కృతిక సంబంధాలపై సుదీర్ఘచర్చలతో పాటు ఉజ్వల భవిష్యత్‌ను రూపొందించడంలో ప్రపంచ భాగస్వామ్యాల ఆవశ్యకతను వక్తలు ప్రధానంగా ప్రస్తావించారు. దీంతోపాటు విశిష్టసాధకులకు ప్రతిష్టాత్మక అవార్డులు ప్రధానం చేయడంతో కార్యక్రమం ముగిసింది. ఈకార్యక్రమంలో యునైటెడ్ కింగ్‌డమ్ పార్లమెంట్ సభ్యులు వీరేంద్రశర్మ ముఖ్యఅతిధిగా పాల్గొని శరవణన్‌కు అంతర్జాతీయ అచీవర్ అవార్డును అందజేశారు. ప్రతిష్టాత్మక అవార్డును సాధించినందుకు శరవణన్‌కు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తనప్రకటనలో అభినందించారు.

## అయోధ్య అక్షింతలు పంపిణీ



వాకాడు, జనవరి 14ప్రభాతవార్త

వాకాడు మండలం బాలిరెడ్డి పాళెం గ్రామంలో ఆదివారం అయోధ్య శ్రీరామచంద్రుని అక్షింతలు చేరాయి. తిరుపతి జిల్లా అర్చక సలహ మండలి సభ్యులు దీవి అనంతబాబు చేతుల మీదగా అంద చేశారు. ఈ సందర్భంగా అనంతబాబు మాట్లాడుతూ ఈ నెల 22 వ తేదిన అయోధ్యలో ప్రాణ ప్రతిష్ట మహోత్సవాల సందర్భంగా స్వామి వారి అనుగ్రహం పొందడానికి అయోద్యలో బాలరామునికి అర్చన చేసిన అక్షింతలు దేశంలోని కాకుండా విశ్వ వ్యాప్తంగా ఉన్న ప్రతి హిందువు ఇంటికి చేర్పించాలనే ఉద్దేశ్యంతో శ్రీరామ జన్మభూమి తీర్ద క్షేత్ర ట్రస్ట్ వారు అక్షింతలు పంపించారన్నారు. తిరుపతి జిల్లా ధర్మ ప్రచారక్ ఏటూరు శ్రీనివాసులు రెడ్డి మాటాడుతూ అయోధ్యలోని శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట మహర్తం సందర్భంగా సాయంత్రం ఐదు దీపాలను వెలగించి తమ ఇంటి ముదు స్వామి అనుగ్రహాన్ని పొందాలన్నారు. ప్రతి ఇంటికి రామనామ స్మరణతో భక్తి సంకీర్తనలతో శ్రీరాముని చంద్రుని అక్షింతలు పంపిణి చేశారు.

## భోగి పర్వదినాన భక్తులకు స్వామి దర్శనం

తిరుపతి,జనవరి 14ప్రభాతవార్త:



ధనుర్మాసం చివరిరోజు ఆదివారం తిరుపతిలోని బండ్లవీధిలో ఉన్న పురాతన రామాలయంలో స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. నెలరోజుల పాటు అత్యంత వైభవంగా ప్రవచనాలు నిర్వహించారు. చివరిరోజు ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి చిలుక బొమ్మలను అలంకరింపజేశారు. భక్తులకు ప్రసాదవితరణ ,తీర్థం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు గుండాల గోపీనాథరెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, తిరుపాల్ ఆచారి, సుబ్రమణ్యంరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, భూషణ్‌రెడ్డి, శీను,గోపి, చంద్రారెడ్డి,రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## సాంప్రదాయబద్ధంగా భోగి పండుగ



తడ, జనవరి 13 ప్రభాతవార్త

తడ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భోగి పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఈసారి పండుగ ఆదివారం రావడంతో మాంసాహార ప్రియులు ఈ పండుగను ఇష్టంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి నుంచే భోగిమంటలు వేసుకొని చలి కాచుకున్నారు. సంక్రాంతి సంబరాలలో మొదటిరోజు భోగి పండుగ ఉత్సాహంగా ముగియడంతో సోమవారం సంక్రాంతి పండుగకు సిద్ధమవుతున్నారు.

## పట్టీల కోసం యువత పోరాటం

### ఉత్కంఠభరితంగా జల్లికట్టు

రామచంద్రాపురం, జనవరి 14 ప్రభాతవార్త:



పట్టీలను కైవశం చేసుకునేందుకు యువత పోరాటం చేశారు. సంక్రాంతి సంబరాలలో అరుదైన ఘట్టం పశువుల పండుగను గ్రామీణ యువత ఉత్సాహంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని అనుప్పల్లిలో జల్లికట్టు సంబరాలను వైభవంగా నిర్వహించారు. పాడి రైతు ఎద్దుకు కట్టిన పట్టీని ఒడిసి పట్టుకోవడం కోసం పోటెత్తిన పౌరుషంతో యువత పోరాటమే చేసింది. జల్లికట్టు సంబరాలకు వందలాది పాడి ఆవులను, ఎద్దులను ముస్తాబు చేశారు. ఏడాదికి ఒకమారు పాడిరైతులు జరుపుకునే పశువుల పండుగ రోజున ఏరువాకలో తమకు చేదోడుగా నిలిచి

## శ్రీకాళహస్తిలో సంక్రాంతి సంబరాలు

### -భోగి వెలిగించిన జనం



శ్రీకాళహస్తి, జనవరి 14 ప్రభాతవార్త

ప్రతి ఏడాది మొదటగా వచ్చే పండుగల్లో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు ఎంతో ముఖ్యమైనవిగా చెప్పుకోవచ్చును. సంక్రాంతి సంబరాల్లో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని వీధుల్లో జనంతో నిండిపోయింది. పట్టణంలోని ప్రధానవీధులయిన నెహ్రూవీధి, సినిమావీధి, బజారువీధి, నగరివీధులు జనంతోనూ, ద్విచక్ర వాహనాలతో నిండిపోయాయి. ఈమార్గంలో ఉన్న బట్టల దుకాణాల్లో ఎటుచూసినా జనం పండగకు కొత్తబట్టలు కొనుగోలు చేస్తు కనిపించారు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఇక గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన జనంతో వీధులు నిండిపోయాయి. ఆర్‌టిసి బస్టాండువీధుల్లో కూడా జనం కిటకిటలాడారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఇళ్లకు కొత్తశోభను సంతరించుకున్నాయి. గ్రామీణలు ఇంటికి కొత్తరంగులు వేయడానికి రంగులను తీసుకువెళ్తున్నారు. ఇక ఆర్టీసి బస్టాండు, బాబుఅగ్రహారం, కుమారస్వామి తిప్పవీధులు జనంతోనిండిపోయాయి. ఎక్కడ చూసినా ప్రజలు తమ చిన్నారులకు కొత్తబట్టలను కొనుగోలుచేసుకుని కావాల్సిన సామగ్రిని తీసుకుని వెళ్తున్నారు. ఇక మార్కెట్‌వీధిలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కూరగాయాల వ్యాపారస్తులుసైతం రోడ్లపైనే కూరగాయలను ఉంచి అమ్ముతున్నారు. ఇక బట్టల వ్యాపారస్తులు సైతం తమ రేట్లను తగ్గించలేదు. ఇక మహిళలు, యువతులు చీరల దుకాణాల్లో తమకు వచ్చిన వాటిని కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో దుకాణాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. పండగ అంటే కొత్త బట్టల కొనుగోలుకే ప్రాదాన్యత ఇస్తున్నారు. దాంతో వీధికి నాలుగైదు బట్టల దుకాణాలు వెలుస్తున్నాయి. ఎన్ని దుకాణాలు వెలసినా రద్దీ మాత్రం తగ్గటం లేదు. ఇక సంక్రాంతి సందర్భంగా చెరుకు గడలు సిద్ధమయ్యాయి. మహిళలు రంగవల్లులకు రంగులు అద్దడం కోసం రంగులను కొనుగోలు చేయడం కనిపించింది. పెండ్లిమండపం వద్ద ట్రాఫిక్ ఎక్కువ కావడంతో పోలీసులు క్రమబద్దీకరించారు.ఇక మహిళలు మట్టి గొబ్బెమ్మను కొనటం కనబడింది. ముత్యాలమ్మగుడివీధిలోని కుమ్మర మిట్ట వద్ద మట్టి ఏనుగులపై గొబ్బెమ్మను తయారుచేసిన విగ్రహాలను పూజలు జరిపి కొనుగోలు చేయటం కనబడింది.

## వార్త తోనే ప్రజల్లో చైతన్యం

### క్యాలెండర్‌ని ఆవిష్కరించిన టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు

పాలసముద్రం, జనవరి 14 ప్రభాతవార్త:



మూడు దశాబ్దాల కిందట సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించిన మొట్ట మొదటితెలుగు దినపత్రిక వార్త సామాజిక రాజకీయ అంశాలపై జనంలో చైతన్యం తీసుకొచ్చిందని టీడీపీ ఏపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు అన్నారు. క్షేత్ర స్థాయిలో రోజువారి వార్తలతో సమస్యలను కళ్ళకు కట్టినట్టు తెలియజేయడంలో వార్త దినపత్రిక పాత్రికేయులు, సిబ్బంది ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ని ఆదివారం పాలసముద్రం మండలం తెలుగు దేశం పార్టీ కార్యాలయం వద్ద ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన దినపత్రిక గురించి జనం చేతిలో పాశు పతాస్త్రంగా తీసుకొచ్చిన వార్త దినపత్రిక యాజమాన్యం ఇప్పటికి ఒకే ధృఢ సంకల్పంతో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం చేయడంలో వారధిలా మారిందన్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ కార్యదర్శి వాసునాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రేణుగోపాల్, మండల పార్టీ కోశాధికారి విజయకుమార్, నియోజకవర్గ ఆర్గనైజర్ సెక్రటరీ భవరివాసన్, పాలసముద్రం పంచాయతీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ నాయుడు, శ్రీ కావేరి రాజపురం పంచాయతీ ప్రధాన కార్యదర్శి ఏళుమలై, బాబు యాదవ్, మునిరాజులు తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచర్స్ అరెస్టు

### 9 లక్షలు విలువ చేసే బంగారు నగలు స్వాధీనం



గూడూరు, జనవరి 14, ప్రభాతవార్త

గూడూరు రూరల్ పరిధిలో ఒంటరి మహిళల మెడలో బంగారు గెలుసులను అపహరించే ఇద్దరు యువకుల అరెస్టు అరెస్టు చేసిన సంఘటన చోటచేసుకుంది. గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ వేణు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు రూరల్ పరిధిలోని మధు రెడ్డి కాలనీలో గత సంవత్సరం ఆరు బయట నిద్రిస్తున్న మహిళ మెడలో గెలుసులను అపహరించారన్నారు. ఒంటరిగా ఉండే మహిళ మెడలో గెలుసులు దొంగతనం చేస్తున్న చిట్టేటి అనిల్ కుమార్, సంక్రాంతి శ్రీనివాసులును గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళశాల సమీపంలో అరెస్ట్ చేశామన్నారు. ముద్దాయిల దగ్గర నుండి 9 లక్షల విలువచేసే 142 తులాల బంగారు ఆభరణాలు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నమన్నారు. అనంతరం సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మి అలంకరణలో పెద్దశేష వాహనంపై ఎల్లమ్మ

### వైభవంగా సంక్రాంతి మహోత్సవాలు



చంద్రగిరి, జనవరి 14 ప్రభాతవార్త:

శ్రీ లక్ష్మి అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ పెద్దశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రగిరి గ్రామదేవత, సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి సంక్రాంతి మహోత్సవాలను ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఈఓ సి.ఆర్.తిమ్మారెడ్డి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు సూరి స్వామి బాలాలయంలో అమ్మవారికి వేకువజామున అభిషేకం జరిపించారు. తదుపరి విశేష అలంకరణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధరకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి పెద్దశేష వాహనంపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండుబాజాల నడుమ వాహనసేవ కన్నుల పండువగా సాగింది. ఈ వాహనసేవకు చంద్రగిరికి చెందిన రాజులగారి వంశస్తులు దాతలుగా వ్యవహరించారు.



**గజలక్ష్మి వాహనంపై విహరించిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ**

చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారు ఆదివారం సాయంత్రం గజవాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి సంక్రాంతి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సాయంత్రం అమ్మవారిని ఆలయ అర్చకులు వివిధ రకాల పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి, గజలక్ష్మీ అలంకరణలో గజవాహనంపై అధిషింపజేశారు. బ్యాండుబాజాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారు పట్టణ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం వాహన సేవకు చంద్రగిరికి చెందిన లేట్ జి.ఎల్.రాజగోపాల్ శెట్టి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ సి.ఆర్.తిమ్మారెడ్డి దాతలకు దర్శన ఏర్పాట్లు గావించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కోట అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

### రాష్ట్ర భాజపా కార్యవర్గ సభ్యులు పనబాక



కోట, జనవరి 14, ప్రభాతవార్త

భారత ప్రధాని నరేంద్ర మోడీ 9 ఏళ్ళ పాలనలో సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తుంటే కోట మండలంలో మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యం వలన ప్రజలకు ఈ పథకాలపై అవగాహన కల్పించలేకపోతున్నామని రాష్ట్ర భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వర రావు చెప్పారు. ఆదివారం మండలంలోని వెంకనపాళెం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు గైర్హాజరు అయ్యారని చెప్పారు. ముందుగా అధికారులు పలానా గ్రామంలో భారత సంకల్పయాత్ర జరుగుతుందని షెడ్యుల్ ప్రకటించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. భారత ప్రధాని మంత్రి అంటే మండల స్థాయి అధికారులు లేక్క లేదాని ఆయన ప్రశ్నించారు.జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని ఇందుకు బాధ్యలైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ మేరకు మండల స్థాయి అధికార యంత్రాంగం పై గూడూరు ఆర్డివోకు ఫిర్యాదు చేసిన్నట్లు తెలిపారు. ఈ నెల 17న కోట మండలంలో మంత్రి పర్యటనలో కూడా అధికారుల తీరుపై ఫిర్యాదు చేస్తామని కోటేశ్వర రావు చెప్పారు. ఆయన వెంట మండల భాజపా అధ్యక్షులు డా.సారంగం రమేష్‌బాబు ఉన్నారు.

## టిడిపి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### గంజి మాధవయ్య

పుత్తూరు, జనవరి 14 ప్రభాతవార్త :




తెలుగుదేశం పార్టీ మినీ మ్యానిఫెస్టోలోని గ్యారంటీ పథకాలను ఐటిడిపి ప్రతినిధులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిడిపి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఈ పథకాల కోసం క్షుణ్ణంగా వివరించాలని తెలిపారు. నగరి నియోజకవర్గ ఐటిడిపి రూపొందించిన క్యాలెండర్‌ను ఆదివారం పట్టణంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత విద్యలు అభ్యసించి టిడిపి గెలుపు కోసం స్వచ్ఛంధంగా పనిచేస్తున్న ఐటిడిపి ప్రతినిధుల సేవలు అభినందనయమని ప్రశంసించారు. టిడిపితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయనే అంశాలపై ప్రజల్లో విస్తృత చర్చ జరిగేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఐటిడిపి సభ్యుల సంఖ్యను పెంచుకుని టిడిపి గెలుపు కోసం మరింత శ్రమపడాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, రూరల్ మండల మాజీ అధ్యక్షుడు కరుణ యాదవ్, రాష్ట్ర తెలుగు యువత మీడియా సమన్వయకర్త డి.జి.ధనపాల్, రాష్ట్ర ఐటిడిపి సమన్వయకర్త గాలి గోపినాథ్, నగరి నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు ప్రసాద్, ఇంకా ఐటిడిపి సభ్యులు ధనంజయులు, వెంకటేష్, లీలాప్రసాద్, దినేష్, బుజ్జిబాబు, ఈశ్వర్ యాదవ్, జగత్‌సాయి తదితరుల పాల్గొన్నారు.

## టిడిపి హెడ్‌కానిస్టేబుల్ అత్యుత్సాహం వల్లే సమస్య

నగరి, జనవరి 14 ప్రభాతవార్త :

ప్రభుత్వ పనులకు ఇసుక తీసుకెళుతుండగా తెలుగుదేశం పార్టీ సూచనతో టిడిపికి అనుకూలంగా వుండే హెడ్‌కానిస్టేబుల్ అడ్డుకోవడంతో మంత్రి ఆర్.కె.రోజా అనుచరుడు ఆగ్రహం వ్యక్తం చేయాల్సి వచ్చిందని వైకాపా నాయకులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్‌పై మంత్రి అనుచరుడు రెచ్చిపోయాడంటూ జరిగిన ప్రచారంలో నిజం లేదని ఆదివారం పట్టణంలో వైకాపా నాయకులు పత్రికలకు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ అభివృద్ధి పనులకైతే ఇసుక విడిచిపెట్టాలా, మంత్రి చెపితే వదిలేయాలా, వర్కు ఆర్డర్ వుంటే సరిపోతుందా అంటూ రెచ్చగొట్టారని తెలిపారు. దాంతో మంత్రి అనుచరుడు ప్రతీష్... మంత్రిని అవమానపరిస్తే సహించమని గట్టిగా చెప్పాల్సి వచ్చిందన్నారు. నగరిలో ఇసుక మాఫియాకు టిడిపి పర్యాయపదమని ఆరోపించారు. ప్రస్తుతం నగరిలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు టిడిపి నాయకులు చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఈ రాద్ధాంతానికి కారణమని తెలిపారు. ఇసుక తీసుకువచ్చిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయో లేదో ఎవరైనా పరిశీలించుకోవచ్చని స్పష్టం చేశారు.

# కైలాసగిరి ప్రదక్షిణకు సన్నాహాలు

### నేడు త్రిశూలం పల్లకి ప్రదక్షిణ

శ్రీకాళహస్తి,జనవరి 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని గిరి ప్రదక్షిణ ఉత్సవం ఈ నెల 16 మంగళవారం నిర్వహించబడుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.యస్.రామారావు ఆదివారం ప్రకటించారు. ఈ ఏడాది గిరిప్రదక్షిణకు వెళ్ళు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సదుపాయాలు కల్పనకు తన సిబ్బందికి ఆదేశించారు.ఈ గిరి ప్రదక్షిణకు భక్తులు భారీ సంఖ్యలో హాజరౌతారు.

ఇక్కడిఆలయంలో నిర్వహించే ప్రతి ఉత్సవానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఏడాదిలో రెండు సార్లు కైలాసగిరి ప్రదక్షిణం నిర్వహించటం ఆనవాయితి. సంక్రాంతి కనుమ రోజు నిర్వహించే గిరి ప్రదక్షిణం కైలాసగిరుల్లోని ముక్కోటి దేవతలకు మహాశివరాత్రి సందర్భంగా జరిగే స్వామి అమ్మవార్ల కళ్యాణానికి ఆహ్వానంగా అభివర్ణిస్తారు. శివరాత్రి కళ్యాణోత్సవం తరువాత జరిగే గిరి ప్రదక్షిణను తన వివాహానికి వచ్చిన దేవతల్ని తిరిగి వారి స్థావరాలకు చేర్చటం అని చెబుతారు. సుమారు 21 కిలో మీటర్ల గిరి ప్రదక్షిణలో ఎన్నో గ్రామాలున్నాయి. ప్రతి గ్రామం వద్ద స్వామి అమ్మవార్లకు ఘనస్వాగతం చెబుతారు. సుమారు 16 గ్రామాల్లో ఆ రోజు పండగ జరుపుకుంటారు. గిరిప్రదక్షిణ గ్రామాల్లో కనుమకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఏడాదిలో రెండుసార్లు నిర్వహించే గిరి ప్రదక్షిణకు ఈ ఏడాది సుమారు 3లక్షల మంది హాజరుకావాలని శాసనసభ్యుడు బియ్యపు మదుసూధనరెడ్డి,ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రకటించారు. మంగళవారం స్వామి అమ్మవార్లు తమ గ్రామాలకు వస్తారు. మామిడితోరణాలు, ముగ్గులతో ముస్తాబు చేస్తారు. ఆదివారం ప్రదోష మూర్తులు గిరిప్రదిక్షణకు వెళుతుందని వివరించారు. ఉదయం ఆలయం నుంచి బయలుదేరు స్వామి అమ్మవార్లు సాయంత్రం పట్టణానికి చేరుకొని గ్రామోత్సవం నిర్వహిస్తారు.ఈ సందర్భంగా ఆలయంలో రెండు రోజుల పాటు భక్తుల ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ప్రకటించారు.



స్వామిఅమ్మవార్ల గిరిప్రదక్షిణం

దేవస్థానమే అభిషేకాలు నిర్వహిస్తారు.గతంలో ముళ్ళ పొదలు, రాళ్ళురప్పలు కల్గిన కొండ దిగువప కాలిపడకప వెళ్ళె వారు. కానీ మారిప కాలానుగుణంగా కొండ చుట్టూ సిమెంటు రోడ్డు ఎంఎల్‌ఏ పట్టుబట్టి సిమెంటు రోడ్డు వేశారు. దాంతో ఇదో వేడుకగా మారింది. స్వామి అమ్మవార్లను మోసే కూలిలకు కూడా సులభమైంది. గ్రామాల్లో సందడి చోటు చేసుకుంది. కొత్త ధర్మకర్తల మండలి, కొత్త ఇఓ సారధ్యంలో మొదటి గిరి ప్రదక్షిణ మంగళవారం నిర్వహించనున్నారు.